
అవుటర్ ఆశలు



రియల్ ఎస్టేట్ రంగానికి ఊతం

మౌలిక సదుపాయాల కల్పనకు అవకాశాలు

అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)తో ఉమ్మడి కృష్ణాజిల్లాలోని పల్లెలకు మహర్దశ పట్టనుంది. తాజాగా ఓఆర్ఆర్‌కు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో రియల్ ఎస్టేట్ రంగానికి ఊతం లభించింది. గ్రామీణుల భూములు, ఆస్తుల విలువ పెరగనుంది. మారుమూల గ్రామాలకు సైతం మౌలిక సదుపాయాలు సమకూరనున్నాయి. రెసిడెన్షియల్, కమర్షియల్‌గా ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందటంతో పాటు స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు రానున్నాయి.

పెట్టుబడుల ఆకర్షణతో ఉపాధి, ఉద్యోగాల కల్పన

అమరావతి, విజయవాడ, గుంటూరు నగరాలతో అనుసంధానం

పరిశ్రమల స్థాపన, పర్యాటక, ఆతిథ్య రంగాల అభివృద్ధికి బాటలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)కు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఉమ్మడి కృష్ణాజిల్లాలో పండుగ వాతావరణం నెలకొంది. ఎన్టీఆర్ జిల్లాలో కంచికచర్ల, వీరులపాడు, జి.కొండూరు, మైలవరం, కృష్ణాజిల్లాలో బాపులపాడు, గన్నవరం, ఉంగుటూరు, కంకిపాడు, తోట్లవల్లూరు మండలాల పరిధిలోని మొత్త 52 గ్రామాల మీదుగా ఈ అవుటర్ రింగ్ రోడ్డు వెళుతుంది. కంచికచర్ల నుంచి మొదలై జుజ్జూరు, నందిగామ, జి.కొండూరు, మైలవరం, అంపాపురం, పెద్ద అవుటపల్లి, మారేడుమాక, దావులూరు, రొయ్యూరు, చిన పులిపాకల మీదుగా గుంటూరు జిల్లాలోకి ప్రవేశిస్తుంది. అలైన్‌మెంట్ పరిధిలోకి వచ్చే ఆయా ప్రాంతాలన్నింటికీ మహర్దశ పట్టనుంది. విజయవాడ ఈస్ట్ బైపాస్ ప్రతిపాదన వెనక్కిపోవటంతో నిరాశతో ఉన్న ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రజల్లో అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ఆశలు రేకెత్తిస్తోంది. ఓఆర్ఆర్‌ను నమ్ముకుని పెట్టుబడులు పెట్టిన వారిలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అతి త్వరలోనే ఓఆర్ఆర్‌కు భూ సేకరణ నోటిఫికేషన్లు వెలువడనున్నాయి. ఏడాది మిగతా 6లో..



పర్యాటకంగా అభివృద్ధి

ఓఆర్ఆర్ వల్ల పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందుతుంది. ఓఆర్ఆర్ అలైన్‌మెంట్ తేటపల్లిలోని బ్రహ్మయ్య లింగం చెరువు పక్క నుంచి వెళుతోంది. దీంతో బ్రహ్మయ్య లింగం చెరువు, బ్రహ్మకైలాసం వంటివి దైవక్షేత్రం పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా మరింతగా అభివృద్ధి చెందటానికి దోహదపడనుంది. ఇలా ఎన్నో ప్రాంతాల్లో స్థానికంగా ఉన్న పర్యాటక వనరులను బట్టి పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుంది. అలాగే హోటల్స్, రెస్టారెంట్లు, కాటేజీలతో ఆతిథ్య రంగం కూడా విస్తరించనుంది.

గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు అనుసంధానం

అమరావతి, విజయవాడ, గుంటూరు వంటి పట్టణ ప్రాంతాలతో సెమీ అర్బన్ ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాలకు ఓఆర్ఆర్ వల్ల అనుసంధానం ఏర్పడుతుంది. దీనివల్ల పట్టణ ప్రాంతాలతో తేలిగ్గా అనుసంధానం కావటంతో పాటు తమ ఆర్థిక కార్యకలాపాలను విస్తరించుకోవటానికి కూడా ఉపయోగపడుతుంది.



పకడ్బందీగా గ్రూప్-2 పరీక్షలు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. విజయవాడలోని 19 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. 8,792 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 8,146 మంది హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఉదయం జరిగిన పేపర్-1కు 7,376 మంది, మధ్యాహ్నం జరిగిన పేపర్ - 2 కు 7,352 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు

ఇంటర్ పరీక్షలపై జిల్లా అధికారి సాల్మన్‌రాజు 6లో

మడ అడవుల ఆక్రమణ

మచిలీపట్నం మండలం కానూరులో మడ చెట్ల నరికివేత

మూడు రోజులుగా సాగుతున్న వ్యవహారం

మడఅడవులపై మళ్లీ అక్రమార్కుల కన్నుపడింది. మచిలీపట్నం మండలం కానూరు రెవెన్యూ గ్రామ పరిధిలో సహజసిద్ధంగా ఎదిగిన మడ చెట్లపై రసాయనాలు వినియోగించి తొలగిస్తున్నారు. 50 ఎకరాలుపైనే కబ్జాకు ప్రణాళిక రచించారు. అటువైపు ఎవరూ రాకుండా పటిష్ట ఏర్పాట్లు చేసుకున్నారు. గత మూడు రోజులుగా సాగుతున్న ఆక్రమణ పర్వంపై పెదపట్నం, కానూరు గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా ఆవైపు ఎవరూ కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

- 50 ఎకరాలపైనే కబ్జాకు ప్రణాళిక
- అధికారులకు పెదపట్నం, కానూరు గ్రామస్థుల ఫిర్యాదు
- అటువైపు కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం



మడ అడవుల్లో కొట్టేసిన చెట్లు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం మండలం కానూరు గ్రామానికి చెందిన స్వామి, అతని అనుచరులు 50 ఎకరాలకుపైగా మడఅడవుల భూములను ఆక్రమించేందుకు పథక రచన చేశారు. మచిలీపట్నం మండలం పెదపట్నం నుంచి బంటుమిల్లి మండలం నారాయణపురం వెళ్లే రహదారికి సమీపంలో కానూరు రెవెన్యూ గ్రామ పరిధిలోని మడఅడవులను ఇందుకు ఎంచుకున్నారు. ఈసారి నూతన వ్యూహాన్ని అమలు చేశారు. ముందుగా మడచెట్లు చనిపోయేందుకు వాటిపై రసాయనాలు పిచికారీ చేయించారు. రసాయనాల ప్రభావంతో చెట్లు ఎండిపోయాయి. వాటిని గత మూడు రోజులుగా కూలీలను తీసుకువెళ్లి కొట్టి తొలగిస్తున్నారు. ఇదేంటని ఎవరైనా ప్రశ్నిస్తే తమకు అధికారులు, రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయని చెబుతూ ఆక్రమణ కొనసాగిస్తున్నారు. నారాయణపురం వంతెన వద్ద నుంచి చెట్లను నరికివేస్తున్న ప్రాంతానికి ఎవ్వరినీ వెళ్లనీయకుండా అక్రమార్కులు పటిష్ట నిఘాను ఏర్పాటు చేశారు. అటువైపునకు ఎవరైనా వెళుతుంటే వారిని బెదిరింపులకు గురిచేస్తున్నారు.

ఆక్రమణలపై ఫిర్యాదు

కానూరులో ఏపుగా ఎదిగిన మడఅడవులను నరికి భూమిని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని కానూరు, పెదపట్నం గ్రామస్థులు రెండు రోజుల కిందటే అధికారులకు ఫిర్యాదు చేశారు. మడచెట్లు నరికివేస్తున్న ప్రాంతంలో రొయ్యల చెరువులు ఉన్నాయని, అక్కడకు వెళ్లకుండా నిఘా ఏర్పాటు చేశారని గ్రామస్తులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ అంశంపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పెదపట్నం, కానూరు గ్రామస్తులు కోరుతున్నారు.

మత్స్యకారులను బెదిరిస్తూ..

కానూరు గ్రామం సముద్రం పక్కనే ఉండటంతో మడ అడవుల్లోకి సముద్రపు పోటు సమయంలో ఉప్పునీటితోపాటు మత్స్య సంపద మిగతా 6లో..



వైభవంగా వీరమ్మ వసంతోత్సవం

6లో

జిల్లాలో రహదారుల అభివృద్ధికి

అంచనాలు సిద్ధం చేయండి

- పోర్టుకు అనుసంధానంపై చర్యలు తీసుకోండి
- మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి

6లో



బాలుర ఉసురు తీసిన చేపల వేట!

- పోలవరం కాలువలో మునిగి ఇద్దరి మృతి
- ఇద్దరూ అన్నదమ్ముల పిల్లలే
- కోడూరుపాడులో విషాదం

6లో

పామర్రులో దొంగల హల్‌చల్!

వేర్వేరు ఇళ్లలో రూ.20 లక్షల ఆభరణాలు, నగదు చోరీ

6లో

వర్సిటీ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

నాణ్యమైన విద్యాబోధనే లక్ష్యం

భవన నిర్మాణాలు, పరిపాలన అంశాలకు ప్రాధాన్యం

కృష్ణా యూనివర్సిటీ వీసీగా కె.రాంజీ బాధ్యతల స్వీకరణ

మచిలీపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ప్రణాళికలతో యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానని కృష్ణా యూనివర్సిటీ వీసీ కె.రాంజీ తెలిపారు. నాణ్యమైన విద్యాబోధన, భవనాల నిర్మాణం, పరిపాలనాపరమైన అంశాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. వీసీ చాంబరులో ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సెనెట్ హాలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. గతంలో శ్రీకాకుళం జిల్లా బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీకి మూడేళ్లు వీసీగా, నాగార్జున యూనివర్సిటీకి ఇన్‌చార్జి వీసీగా ఏడాది పాటు పనిచేశానన్నారు. ఈ అనుభవంతో కృష్ణా యూనివర్సిటీని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తానని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఇక్కడ నాణ్యమైన విద్యను అందించేందుకు తగు చర్యలు తీసుకుంటానన్నారు. బాలురు, బాలికల వసతి గృహాలను ఏడాది లోపు నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తెస్తామన్నారు. మిగిలిన భవనాలు ఏ కారణంతో నిలిచిపోయాయో విచారణ జరిపి, త్వరితగతిన ఈ భవనాల నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యార్థులకు విద్యతోపాటు సామాజిక స్పృహను కలిగించేందుకు గ్రామాల్లో ఒకరోజు పాటు పర్యటించి అక్కడి పరిస్థితులపై అధ్యయనం చేయిస్తామన్నారు. వర్సిటీ పరిధిలో 120 కళాశాలలు ఉన్నాయని, వాటన్నింటినీ ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేస్తామన్నారు. వర్సిటీ ప్రాంగణాన్ని మిగతా 6లో..



మీడియాతో మాట్లాడుతున్న వీసీ రాంజీ, చిత్రంలో బసవేశ్వరరావు, శోభన్‌బాబు, ఉషా



దుర్గమ్మ దర్శనానికి క్యూలలో వేచి ఉన్న భక్తులు

ఇంద్రకీలాద్రిపై సరస్వతీ యాగం



ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై ఆదివారం మాఘమాసం మూలా నక్షత్రం సందర్భంగా దుర్గగుడి యాగశాలలో మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ అర్చకస్వాములచే సరస్వతీ యాగం శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాష్ట్రం విద్యలవాడగా వెలుగొందాలని త్రిశక్తి స్వరూపమైన కనకదుర్గాదేవి ఆలయంలో మూలా నక్షత్రం రోజున సరస్వతీ యాగం నిర్వహించారు. ప్రతినెలా మూలా నక్షత్రం నాడు దేవస్థానం ఆర్జిత సేవ కింద నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని సేవించారు. పరీక్షలు త్వరలో ప్రారంభం కానుండగా విద్యార్థులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

సూర్యోపాసన సేవ..



మాఘమాసం ఆదివారం వేదపండితులు సూర్యోపాసన సేవ అరుణ పారాయణ, తదితర సేవలను నిర్వహించారు. సూర్యనారాయణ మూర్తి చిత్రపటానికి శోడశోపచార పూజలు నిర్వహించి, అర్చనాది కార్యక్రమాలను పూర్తిచేసి మంత్ర పుష్పం, హారతి, ఆశీస్సులు అందజేశారు. భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి ఆదివారం పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు కుటుంబాలతో తరలివచ్చారు. తలనీలాలు సమర్పించుకుని, కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేసి అమ్మవారి దర్శనానికి కొండపైకి చేరుకున్నారు. పొంగళ్లు సమర్పించారు. వివిధ ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. అమ్మవారి దర్శనానికి అధికారులు, సిబ్బంది ముందస్తు ప్రణాళిక ప్రకారం క్యూలైన్లలో భక్తులను నియంత్రించారు.

ట్రాఫిక్ మళ్లింపు.. వాహనదారుల ఇబ్బందులు

దురమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున తరలిరావటంతో విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్ వద్ద ట్రాఫిక్‌ను చిట్టినగర్ వైపునకు మళ్లించారు. హైదరాబాద్ వైపు నుంచి పెద్దఎత్తున వాహనాల్లో దుర్గగుడికి విచ్చేశారు. భవానీపురం స్వాతి సెంటర్ నుంచి కుమ్మరిపాలెం సెంటర్ వరకు వాహనాలు బారులు తీరాయి. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. భక్తులతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భవానీపురం ట్రాఫిక్ పోలీసులు కుమ్మరిపాలెం సెంటర్ వద్ద నుంచి వాహనాలను అంబేడ్కర్ రోడ్డుమీదుగా చిట్టినగర్ వైపునకు మళ్లించారు.

వైభవంగా దుర్గానాగేశ్వరుని కల్యాణ మహోత్సవాలు



మోపిదేవి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన పెదకళ్లేపల్లిలో స్వయంభువుగా కొలువైన దుర్గా నాగేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం ఆలయ అనువంశిక ధర్మకర్తలైన చల్లపల్లి రాజా వంశీయులు, ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించగా.. పెండ్లి కుమారుడిని చేయుటతో కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రధాన అర్చకులు బుద్దు వరప్రసాద్ ఆధ్వర్యంలో అర్చక బృందం వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా పెండ్లి కుమారుడిని గావించారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు మహోత్సవంలో పాల్గొని ఘట్టాన్ని తిలకించారు. ఆలయ పర్యవేక్షకులు వెంకట రమణ, చెన్నకేశవలు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.



భక్తులతో పోటెత్తిన సుబ్బారాయుడి ఆలయం

మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివాకం భక్తులతో కిటకిటలాడింది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో క్యూలైన్‌లు నిండిపోయాయి. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. నాగవల్లి వృక్షం వద్ద ముడుపులు కట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణ, మధుసూదనరావులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.



మెట్టినింటికి చేరుకున్న వీరమ్మకు ఆడపడుచుల వసంతోత్సవం

వైభవంగా వీరమ్మ వసంతోత్సవం

ఉయ్యూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : వీరమ్మ వసంతోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహిచారు. పదిహేనురోజులపాటు అంగరంగ వైభవంగా జరిగిన తిరునాళ్ల శనివారం రాత్రితో ముగియగా తిరుగు గండ దీపాల భక్తులు వెంటరాగా ఊరంతా ఊరేగి ఆదివారం మధ్యాహ్నం రావిచెట్టు సెంటర్‌లోని మెట్టినింటికి చేరుకున్నారు. గ్రామోత్సవం అనంతరం మెట్టినింటికి చేరుకున్న అమ్మవారికి పారుపూడి వంశస్థుల ఆడపడుచులతో పాటు పలువురు మహిళలు స్వాగతం పలుకుతూ బిందెలతో నీళ్లువారపోసి వసంతోత్సవం ఆడారు. మెట్టినింటికి చేరుకున్న వీరమ్మ శివరాత్రి రోజున తోట్లవల్లూరు మండలం ఐలూరులో కృష్ణానదీపాయల్లో పవిత్ర స్నానమాచరించి తిరిగి మెట్టినింటికి చేరకుంటారు.

జిల్లాలో రహదారుల అభివృద్ధికి

అంచనాలు సిద్ధం చేయండి

» పోర్టుకు అనుసంధానంపై చర్యలు తీసుకోండి » మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి

మచిలీపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం పోర్టుకు అనుసంధానంగా రహదారుల అభివృద్ధికి అంచనాలు తయారు చేయాలని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అధికారులను ఆదేశించారు. విజయవాడలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో జాతీయరహదారుల అధికారులతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఇటీవల కేంద్రమంత్రి గడ్కరీని కలిసి బందరు పోర్టు, జిల్లాలో ఇతర రహదారుల అనుసంధానానికి సహకరించాలని కోరగా.. దానికి సంబంధించిన నివేదికలను సమర్పించాలని కోరినట్టు తెలిపారు. పోర్టు నుంచి మాచవరం రైస్‌మిల్లు వరకు రహదారిని 3.7కిలోమీటర్ల మేర నాలుగులేన్లుగా అభివృద్ధి చేసేందుకు, మాచవరం రైస్‌మిల్లు నుంచి జాతీయ రహదారి 65 వద్ద ఉన్న అండర్‌పాస్ వరకు 4కిలోమీటర్ల మేర రెండులేన్లుగా ఉన్న రహదారిని నాలుగులేన్లుగా అభివృద్ధి చేసేందుకు అంచనాలు తయారు చేయాలన్నారు. మంగినపూడి బీచ్ రోడ్డును 8 కిలోమీటర్లమేర నాలుగు లేన్లుగా అభివృద్ధి చేసేందుకు, ఈ రహదారి వెంబడి రెండు రైల్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి అంచనాలు తయారుచేయాలన్నారు. గుడివాడలో నిర్మాణంలో ఉన్న ఆర్వోబీ నుంచి 3.2కిలోమీటర్ల మేర రహదారి అభివృద్ధి, మధ్యలో డివైడర్, సెంట్రల్ లైటింగ్, డ్రెయిన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పెడన-గుడివాడ-హనుమాన్‌జంక్షన్-నూజివీడు-లక్ష్మీపురంరోడ్ అభివృద్ధిపైనా ఎంపీ పలు సూచనలు చేశారు. పెడన నుంచి నూజివీడు వరకు 78కిలోమీటర్లమేర నాలుగులేన్లుగా, నూజివీడు నుంచి తిరువూరు సమీపంలోని లక్ష్మీపురం రోడ్ వరకు 42 కిలోమీటర్లమేర రెండు లేన్లుగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు తయారుచేయాలన్నారు. ప్రతిపాదనలు సిద్ధంచేస్తే కేంద్రమంత్రితో మాట్లాడి నిధుల కేటాయింపునకు చర్యలు తీసుకుంటానని ఎంపీ ఈ సందర్భంగా తెలిపారు.



జాతీయ రహదారుల అధికారులతో చర్చిస్తున్న ఎంపీ బాలశౌరి



పరీక్షల నిర్వహణపై సూచనలు ఇస్తున్న జిల్లా అధికారి సాల్మన్‌రాజు

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

» జిల్లా అధికారి సాల్మన్‌రాజు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అధికారి సాల్మన్‌రాజు సూచించారు. ఆదివారం లేడీయాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్‌లు, ఇన్విజిలేటర్లు, మొబైల్ టీమ్స్‌తో విస్తృతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. సమావేశంలో సాల్మన్‌రాజు మాట్లాడుతూ, 63 పరీక్షా కేంద్రాల్లో 45,430 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. మార్చి1 నుంచి నిర్వహించే పరీక్షలకు విద్యార్థులకు హాల్‌టికెట్లు పంపామన్నారు. విద్యార్థులకు ఏవిధమైన అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కాపీలు జరగకుండా చీఫ్ సూపరింటెండెంట్‌లు శ్రద్ధ వహించాలన్నారు. 163 కళాశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఉంటుందని, ప్రాథమిక చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. మూడు సెట్ల ప్రశ్నాపత్రాలను 18 పోలీసు స్టేషన్లకు పంపామన్నారు. ఏ సెట్ ఏ రోజు ఇవ్వాలో ఒక రోజు ముందుగా తెలియచేస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు ఎన్‌వివి నరసింహారావు, పి. నాగరవి, జీవీ రమణ, ఎస్.అరుణప్రభ, బి.సుందరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళకు అరుదైన శస్త్ర చికిత్స

» శ్రీరామా నర్సింగ్ హోమ్ వైద్యుల ఘనత



వివరాలు తెలుపుతున్న డాక్టర్ వంశీకృష్ణ

గుడివాడ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : సైటస్ ఇన్వరసస్ టోటాలిస్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న మహిళకు విజయవంతంగా శస్త్రచికిత్సను నిర్వహించినట్టు ప్రముఖ వైద్యుడు డాక్టర్ పొట్లూరి వంశీకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఏలూరురోడ్డులోని శ్రీరామా నర్సింగ్ హోమ్‌లో విలేకర్ల సమావేశంలో శస్త్రచికిత్స వివరాలను ఆయన వెల్లడించారు. పట్టణానికి చెందిన మహిళ(46)కు ఎడమ వైపున డొక్కలో నొప్పి రావడంతో వైద్యపరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ క్రమంలో మహిళ అరుదైన సైటస్ ఇన్వరసస్ టోటాలిస్ వ్యాధితో బాధపడుతోందని చెప్పారు. ఈ వ్యాధి ఉన్నవారిలో కాలేయం ఎడమవైపు, గుండె కుడివైపున ఉంటాయన్నారు. ప్రతి 30వేల మందిలో ఒక్కరికి ఇలా జరుగుతుందన్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో మహిళకు గాల్‌బ్లాడర్‌లో రాళ్లతో పాటు మ్యూకోసిల్ వ్యాధి ఉన్నట్టు గుర్తించి, వెంటనే లాపరోస్కోపిక్ విధానం ద్వారా శస్త్రచికిత్స నిర్వహించినట్టు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు కేవలం 32 మందికి మాత్రమే ఈ తరహా శస్త్ర చికిత్స జరిగిందని తెలిపారు. ఈ తరహా వ్యాధి ఉన్నవారు అశ్రద్ధ చేయడం చాలా ప్రమాదకరమని డాక్టర్ వంశీకృష్ణ పేర్కొన్నారు. డాక్టర్లు పొట్లూరి వసుంధర, నూతక్కి శివప్రసాద్‌లతో పాటు సిబ్బంది కలిసి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్టు చెప్పారు.

టోల్ బాదుడు.. హంసలదీవి బీచ్ వెలవెల!

కోడూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : హంసలదీవి బీచ్‌కు పర్యాటకులు వెళ్లేందుకు ఎకో టూరిజం పేరుతో అటవీశాఖ అధికారులు టోల్ చార్జీ వసూలు చేయటంతో పర్యాటకులు లేక ఆదివారం బీచ్ ఖాళీగా దర్శనమిచ్చింది. సెలవు దినాలలో సరదాగా గడిపేందుకు ఇతర ప్రాంతాల నుంచి పర్యాటకులు హంసలదీవి బీచ్‌కి వస్తారు. అయితే బీచ్ వద్ద టోల్ చార్జీలు అధికంగా ఉండటంతో పర్యాటకులు బీచ్‌కు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటి వరకు కృష్ణా అభయారణ్యంగా కొనసాగుతున్న హంసలదీవి బీచ్ నేడు ఎకో టూరిజం పేరుతో ప్రభుత్వమే టోల్ విధానాన్ని అమలు చేయటం వల్ల నేడు ఈ పరిస్థితి వచ్చిందని పర్యాటకులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పునరాలోచన చేసి హంసలదీవి బీచ్ పర్యాటకుల నుంచి టోల్ బాదుడు తప్పించాలని కోరుతున్నారు.



పర్యాటకులు లేక ఖాళీగా ఉన్న హంసలదీవి బీచ్



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న క్లూస్‌టీమ్, చోరీ తీరు పరిశీలిస్తున్న పోలీసులు

పామర్రులో దొంగల హల్‌చల్!

» వేర్వేరు ఇళ్లలో రూ.20 లక్షల అభరణాలు, నగదు అపహరణ

పామర్రు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పామర్రు మండల పరిధిలో దోపిడీ దొంగలు చెలరేగిపోయారు. ఒకేరోజు వేర్వేరు ఇళ్లలోకి చొరబడి పెద్దమొత్తంలో బంగారు అభరణాలు, నగదు దోచుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారిపై మలప్పన్న పేటకు చెందిన సాలిపర్తి వెంకటేశ్వరరావు భార్య ప్రమీలరాణి, కుమారుడితో కలిసి శనివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా రూ. 19లక్షల విలువైన 20కాసుల బంగారు అభరణాలు, నగదు, సెల్‌ఫోన్లు ట్రంకుపెట్టి తాళం పగలగొట్టి దొంగలు ఎత్తుకెళ్లారు. అలాగే పామర్రు-నర్సాపురం జాతీయ రహదారిపై కొండాయపాలెంలో రెండు ఇళ్ల తాళాలు పగలగొట్టి ఇంటేటి కుమారి ఇంట్లో రూ. 90వేల అభరణాలు అపహరించుకుపోయారు. ఇదేకాలనీలో ఆర్టీసీ డ్రైవర్ మెండా వేంకటేశ్వరరావు ఇంట్లో చోరీ చేసి.. మరో ఇంట్లో చోరీకి యత్నించగా గ్రామస్థులు నిద్రలేవడంతో దొంగలు పారిపోయారు. పామర్రు సీఐ వి.శుభకర్, ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్‌ల ఆధ్వర్యంలో క్లూస్‌టీం సంఘటనా స్థలాల్లో అధారాలు సేకరించి కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డీఎస్పీ ధీరజ్ వినిల్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీసీ కెమెరాల ఆధారంగా దొంగలను గుర్తించేపనిలో పోలీసులు ఉన్నారు.

ఆలపాటిని గెలిపించుకుందాం

» మంత్రులు వాసంశెట్టి, రవీంద్ర పిలుపు

పెనమలూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి కూటమి అభ్యర్థి ఆలపాటి రాజా గెలుపునకు కృషి చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, మంత్రి కొల్లు రవీంద్రలు పిలుపునిచ్చారు. ఆదివారం పోరంకి పార్టీ కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై కృష్ణాజిల్లా స్థాయి సమావేశంలో



ఆయన పార్టీ శ్రేణులనుద్దేశించి మాట్లాడారు. ఎన్నికల్లో ఆలపాటి రాజా విజయం తథ్యమని, శ్రేణులు అత్యధిక మెజారిటీ సాధించి పెట్టాలని కోరారు. పోలింగ్ ఏజెంట్ల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్ల గుర్తింపు ముమ్మరం చేయాలని కోరారు. నామినేటెడ్ పదవుల విసయంలో ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, పనిచేసిన ప్రతి ఒక్కరికీ పదవి ఇచ్చే బాధ్యతను ముఖ్యమంత్రి తీసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, కాగిత కృష్ణ ప్రసాద్, వెనిగండ్ల రాము, మండలి వెంకట్రాం, యార్లగడ్డ వెంకట్రావు, పరిశీలకులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, పరిశీలకులు కొమ్మారెడ్డి పట్టాభిరామ్, గోనుగుంట్ల కోటేశ్వరరావు, బండి రామకృష్ణ, స్థానిక నేతలు పాల్గొన్నారు.

అవుటర్ ఆశలు..

(5వ పేజీ తరువాయి)

లోపు ఈ ప్రక్రియ పూర్తయి పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఓఆర్‌ఆర్‌తో రియల్ ఎస్టేట్ కార్యకలాపాలకు ఊతం ఇవ్వడంతో పాటు, అభివృద్ధి అవకాశాలను సృష్టించడం వంటివి జరగనుండటంతో భూముల బూమ్ నెలకొంది.

పెరగనున్న భూములు, ఆస్తుల విలువ

అవుటర్ రింగ్ రోడ్డు అనుసంధానమవుతున్న ప్రాంతాల్లో భూములు, ఆస్తుల విలువలు గణనీయంగా పెరగనున్నాయి. ప్రధానంగా నందిగామ, జి.కొండూరు, మైలవరం, గన్నవరం, కంకిపాడు, పెనమలూరు వంటి ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందటానికి అవకాశం ఉంది. ఓఆర్‌ఆర్ సమీపంలోని భూములు రెసిడెన్షియల్, కమర్షియల్‌గా అభివృద్ధి చెందటానికి దోహదపడుతుంది. అవుటర్ రింగ్ రోడ్డు వెంబడి ఉన్న ప్రాంతాలు వాణిజ్య కేంద్రాలుగా మారనున్నాయి. షాపింగ్ మాల్స్ ఆఫీసులు, వెంచర్లు, నివాస ప్రాంతాలు, కాలనీలు, దాబాలు, షాపులు ఇలా అనేక రకాల కార్యకలాపాలు ప్రారంభమవుతాయి. ఇలాంటి కార్యకలాపాల వల్ల రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు ఊపందుకోవటానికి ఆస్కారం ఏర్పడుతుంది. అవుటర్ వెంబడి కొత్త ప్రాజెక్టులను ప్రారంభించటానికి అవకాశం కలుగుతుంది. రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు ఎక్కువగా సాగటం వల్ల స్థానిక ప్రాంతాల్లో ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది. అనేక ఉపాధి, ఉద్యోగావకాశాలు ఏర్పడతాయి.

పెట్టుబడుల ఆకర్షణ

అవుటర్ రింగ్ రోడ్డు వల్ల పెట్టుబడులను ఆకర్షించటానికి అవకాశాలు పెరుగుతాయి. ప్రధానంగా మేజర్ గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీలు, పట్టణ ప్రాంతాల పరిధిలో రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపుతారు. స్థానిక పెట్టుబడులతో పాటు జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను కూడా ఆకర్షించటానికి వీలుగా పరిస్థితులు ఉంటాయి.

మౌలిక సదుపాయాల కల్పనకు ఊతం

అవుటర్ రింగ్ రోడ్డు సాకారమవుతున్న నేపథ్యంలో పెద్ద సంఖ్యలో ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన కూడా జరుగుతుంది. ప్రధానంగా ప్రభుత్వం ద్వారా నిరంతర విద్యుత్, వాటర్ నెట్‌వర్క్, సీవరేజీ నెట్‌వర్క్, అనుసంధాన రోడ్లు, ఉద్యానవనాలు, పాఠశాలలు, కాలేజీలు వంటివి ఏర్పాటు కావటానికి అన్ని అవకాశాలు ఉన్నాయి.

పరిశ్రమలు, వ్యాపార కేంద్రాలకు మార్గం

అవుటర్ రింగ్ రోడ్డు వల్ల మెరుగైన కనెక్టివిటీని దృష్టిలో పెట్టుకుని పరిశ్రమలు కూడా అవుటర్ వెంబడి కొలువుదీరటానికి అవకాశం ఉంది. అవుటర్ వెంబడి పరిశ్రమల ఏర్పాటు వల్ల తమ ఉత్పత్తులను అత్యంత తేలిగ్గా ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు చేసుకోవటానికి అవకాశం ఉంటుంది. అలాగే దిగుమతులు చేసుకోవటానికి కూడా తేలిగ్గా ఉంటుంది. అనేక రకాల వ్యాపారాలను కూడా స్థాపించటానికి అవకాశం ఉంది. ఈ కార్యకలాపాల వల్ల స్థానికంగా ఉద్యోగావకాశాలు గణనీయంగా పెరుగుతాయి.



బాలురు నీట మునిగిన ప్రదేశం

బాలుర ఉసురు తీసిన చేపల వేట!

» పోలవరం కాలువలో మునిగి ఇద్దరి మృతి

» బాలురు ఇద్దరూ అన్నదమ్ముల పిల్లలే

» గ్రామంలో విషాదఛాయలు

ఆదివారం సెలవుదినం కావడంతో తండ్రితో కలిసి చేపల వేటకు వెళ్లిన అన్నదమ్ముల కుటుంబాలకు చెందిన ఇద్దరు బాలురు మృత్యువాత పడి విగత జీవులవడంతో కోడూరుపాడులో విషాదఛాయలు అలముకున్నాయి. చేతికి వచ్చిన కుమారులు కళ్లఎదుటే నీటిలో మునిగిపోవడంతో ఆ తండ్రులు నిశ్చేష్టులయ్యారు. రెండు కుటుంబాల్లోను ఆ ఇద్దరే మగపిల్లలు కావడంతో వారి వేదన వర్ణనాతీతం.



మృతులు షేక్ నాగూర్‌బాషా, షేక్ షరీఫ్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : చేపల కోసం పోలవరం కాలువకు వెళ్లి గాలం చిక్కుకుపోవడంతో దాన్ని తీసేందుకు వెళ్లి ఒకరు, మునిగిపోతున్న సోదరుడిని రక్షించేందుకు వెళ్లి మరొకరు నీటిలో మునిగి మృతి చెందిన ఘటన కోడూరపాడుపంచాయతీలోని శోభనాద్రిపురం శివారులో ఆదివారం జరిగింది. కొమ్మూరు అండర్‌టన్నెల్ వద్ద పోలవరం కాలువలో చేపల కోసం గేలం వేయగా అది చెత్తలో చిక్కుకుపోవడంతో తీసేందుకు కాలువలోకి దిగారు. లోతు అంచనా వేయలేక నాగూర్‌బాషా(17) మునిగిపోతుండటంతో షేక్ షరీఫ్(18) చేయి అందించి లాగేందుకు చేసే ప్రయత్నంలో భాగంగా ఇద్దరూ మునిగిపోయారు. పిల్లలిద్దరూ మునిగిపోవడం చూసిన భయంలో సుభాని కేకలు వేస్తూ చుట్టుపక్కల వారిని సహాయం కోసం పిలిచాడు. స్థానికులు వీరవల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి వెళ్లిన ఎస్‌ఐ శ్రీనివాస్, సిబ్బంది గాలించినా ఫలితం లేకపోవడంతో దగ్గరలోని రొయ్యల ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఈతగాళ్లను సహకారం అర్థించారు. తాళ్ల సహాయంతో కాలువలో దిగి గంట పాటు శ్రమించి బురదలో కూరుకుపోయిన ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. మృతదేహాలను గన్నవరం ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. నాగూర్‌బాషా విజయవాడ ఎన్నారై కాలేజీలో ఇంటర్ చదువుతుండగా, తండ్రి సుభాని వెల్డింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. షేక్ షరీఫ్ తేలప్రోలులోని ఉషారామ కాలేజీలో పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం చదువుతుంటే.. అతడి తండ్రి జాని ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అందరితో కలుపుగోలుగా ఉండే యువకుల మృతితో కోడూరుపాడులో విషాదం అలముకుంది.

ఎమ్మెల్యే యార్లగడ్డ సంతాపం

పోలవరం కాలువలో ఇద్దరు బాలురు మృతి సమాచారంతో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కాలువ ప్రాంతంలో తక్షణం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని అధికారులను యార్లగడ్డ ఆదేశించారు.

మడ అడవుల ఆక్రమణ

(5వ పేజీ తరువాయి)

చేరుతుంది. సముద్రం ఆటు సమయంలో మడ అడవుల్లోని గుంతల్లో చేపలు, రొయ్యలు, పీతలు ఉండి పోతాయి. వాటిని స్థానిక మత్స్యకారులు పట్టుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ తరహా వేటను కొనసాగించే మత్స్యకారులను సైతం అవైపునకు వెళ్లనీయకుండా అక్రమార్కులు కట్టడి చేస్తున్నారు. దీంతో అసలు విషయం బయటకు వచ్చింది.

గతంలో మణిమేశ్వరం సమీపంలో ఆక్రమణకు యత్నం

గతేడాది నవంబరులో కానూరు రెవెన్యూ గ్రామం, బంటుమిల్లి మండలం మణిమేశ్వరం సరిహద్దులో మడఅడవులను నరికి చెరువులుగా మార్చేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నించారు. ఈ అంశంపై అధికారులకు ఫిర్యాదు అందడంతో మడ అడవుల ఆక్రమణను అడ్డుకున్నారు. ఈ ఏడాది జనవరిలో అదే ప్రాంతంలో మడచెట్లను నరికివేస్తుండటంతో అటవీశాఖ అధికారులు డ్రోన్ కెమెరాలతో పరిశీలించి మడచెట్లను నరికివేయిస్తున్న ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన మరువకముందే కానూరుకు చెందిన కొందరు వ్యక్తులు పెదపట్నం, నారాయణపురం సమీపంలో మడ అడవులను ఆక్రమించేందుకు చెట్లను నరికివేయించడం గమనార్హం.

వర్సిటీ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

(5వ పేజీ తరువాయి)

పచ్చదనంతో ఆహ్లాదకరంగా మారుస్తామన్నారు. ఇందుకోసం ఉపాధి హామీ పథకం నిధులను వినియోగించుకుంటామని తెలిపారు. అన్ని విభాగాల్లో పరిపాలనను గాడిన పెట్టేందుకు తనవంతు ప్రయత్నాలు చేస్తానని, ఎవరైనా సరిదిద్దుకోలేనంతగా తప్పులు చేసినట్టు రుజువైతే వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోనని స్పష్టంచేశారు. రీసెర్చ్ విభాగంలో పరిపాలనా పరమైన అంశాలను పూర్తిస్థాయిలో పరిశీలించి చక్కదిద్దుతామని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి వీసీగా నియమించిన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. తొలుత వీసీకి యూనివర్సిటీ రెక్టార్ ఎంవీ బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ శోభన్‌బాబు, యూనివర్సిటీ క్యాంపస్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషా, ఆయా విభాగాల అధిపతులు, పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

నేడు, రేపు న్యాయవాదుల విధుల బహిష్కరణ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : అడ్వకేట్స్ ఎమెండ్‌మెంట్స్ బిల్లును రద్దు చేయాలంటూ ఈనెల 24, 25 తేదీల్లో న్యాయవాదులు విధులు బహిష్కరించనున్నట్లు మచిలీపట్నం న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బూరగడ్డ అశోక్‌కుమార్ తెలిపారు. గుంటూరు, కృష్ణాజిల్లాల ఫెడరేషన్ ఇచ్చిన పిలుపు మేరకు న్యాయవాదులు ఈ ఆందోళన కార్యక్రమం చేపట్టారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ బిల్లుపై న్యాయవాదుల అభిప్రాయాన్ని తీసుకోమని కమిటీని కోరామని, ఇంత వరకు ఏ విధమైన స్పందన లేదన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	90, 99, 110
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 465

ప్రముఖుల జీవిత చరిత్రలు చదవాలి

● ప్రముఖ సాహితీవేత్త సత్యవాణి



మాట్లాడుతున్న సాహితీవేత్త సత్యవాణి

ఉయ్యూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మహానుభావుల జీవిత చరిత్రలు చదవడం అలవాటు చేసుకుని ఉత్తమ పౌరులుగా ఎదిగి పేరు ప్రఖ్యాతులు గడిచాలని సాహితీవేత్త సత్యవాణి విద్యార్థులకు సూచించారు. ముదునూరులో ఆదివారం జీవిత చరిత్రల గ్రంథాలయం తృతీయ వార్షికోత్సవ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. పిల్లలకోసం జీవిత చరిత్రలు తెలిసే విధంగా గ్రంథాలయం ఏర్పాటు చేసిన నాగులపల్లి భాస్కరరావును అభినందించారు. డీవైఈవో పద్మారాణి, సర్పంచ్ వెంకటనాగలక్ష్మి, సరసభారతి గబ్బిట దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

వంతెనకు వ్యయభారం!

- ఆత్కూరులో ఏలూరు కాలువపై నిలిచిపోయిన నిర్మాణ పనులు
- పట్టించుకోని వైసీపీ నాయకులు
- ఇబ్బందిపడుతున్న ఆత్కూరు వాసులు
- కూటమి ప్రభుత్వంపై ఆశలు



ఆత్కూరులో ఏలూరుకాల్వపై నిలిచిపోయిన బ్రిడ్జి నిర్మాణ పనులు

(ఉంగుటూరు- ఆంధ్రజ్యోతి)

మండల పరిధిలోని ఆత్కూరులో ఏలూరుకాలువపై చేపట్టిన బ్రిడ్జి (భారీ వంతెన) నిర్మాణ పనులు గత కొన్నేళ్లుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ముందుకు సాగక నిలిచిపోయాయి. పాతవంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారటంతో పంట ఉత్పత్తులు తరలించడంలో ప్రత్యామ్నాయ మార్గంలేక రైతులు, మండల కేంద్రానికి రాకపోకలు సాగించేందుకు సులువైన మార్గంలేక పలుగ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈనేపథ్యంలో 2018వసం.లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ. 13.50కోట్ల అంచనాతో కొత్త వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అనంతరం మెటీరియల్ వ్యయం భారీగా పెరగటంతో అంచనా వ్యయాన్ని రూ. 24కోట్లకు పెంచి కడప జిల్లాకు చెందిన వీఎస్ఎస్ కన్‌స్ట్రక్షన్స్‌కు నిర్మాణ బాధ్యతలను అప్పగించింది. ఆ నిధులతో ఏలూరు కాలువపై 12 మీటర్ల వెడల్పు, 71 మీటర్ల పొడవుతో బ్రిడ్జి నిర్మాణంతోపాటు, వంతెనకు ఇరువైపులా అనుసంధానంగా 7మీటర్ల వెడల్పు, 720మీటర్ల పొడవుతో అప్రోచ్‌రోడ్డు నిర్మాణం చేపట్టాల్సివుండగా, ఇందుకోసం రైతులనుంచి 3.16ఎకరాల భూమిని కూడా సేకరించింది. బ్రిడ్జి నిర్మాణపనులు చేపట్టిన కాంట్రాక్టర్ 8.5కోట్ల వ్యయంతో సుమారు 25నుంచి 30శాతం మేర పనులు పూర్తిచేశారు. అతర్వాత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు చెల్లించాల్సిన నష్టపరిహారం చెల్లించకపోవడం, కాంట్రాక్ట్‌ను రద్దుచేయడం వంటి కారణాలతో బ్రిడ్జి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తిచేసి తమను కష్టాలనుంచి గట్టెక్కించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కంకిపాడు పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ భవన్నారాయణ

పోలింగ్ కేంద్రం పరిశీలన

కంకిపాడు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావ రణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని తహసీల్దార్ భవన్నారాయణ అన్నారు. ఆదివారం కంకిపాడు జెడ్పీ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 27వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేపట్టామన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 2,096 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెనమలూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా యనమలకుదురు సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని గుణదల విద్యుత్ శాఖ ఈఈ హరిబాబు తెలిపారు. యనమలకుదురు, డొంకరోడ్డు, పెదపులిపాకలోని శ్రీనగర్ కాలనీ, గణపతి నగర్, ఎంవీఆర్‌నగర్, గ్రీన్ సిటీ కాలనీ ప్రజలు సహకరించాలని కోరారు.



చికెన్ షాపులు వెలవెల

కంకిపాడు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : కోళ్లకు బర్డ్ ఫ్లూ నేపథ్యంలో ఆదివారం చికెన్ షాపులు వెలవెలబోతున్నాయి. ప్రజలు కోడి మాంసానికి దూరంగా ఉంటున్నారు. దింతో మటన్, రొయ్యల దుకాణాలు కిటకిటలాడాయి. దీంతో చికెన్ వ్యాపారులు వ్యాపారం లేక నానా ఇబ్బందులు పడ్డారు.



పదోరోజు దీక్షలో పీటీడీ ఉద్యోగులు

కొనసాగుతున్న పీటీడీ ఉద్యోగుల నిరసన

ఉయ్యూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కార్యాలయ సర్క్యులర్ కు వ్యతిరేకంగా జరిపిన చార్ట్ కౌన్సెలింగ్ రద్దు చేయాలని, దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పీటీడీ ఉద్యోగులు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో చేపట్టిన రిలేదీక్ష ఆదివారం పదవ రోజుకు చేరుకుంది. అసోసియేషన్ జోనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేశ్, అవనిగడ్డ డిపో సెక్రటరీ కుమార్ దీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. జీఎస్ రావు, నాంచారయ్య దీక్షలో కూర్చోగా మచిలీపట్నం డిపో సెక్రటరీ కిరణ్, అవనిగడ్డ డిపో సభ్యులు లక్ష్మయ్య, టీవీ రావు దీక్ష శిబిరానికి విచ్చేసి సంపూర్ణ మద్దతు తెలిపారు.



వైభవంగా కనకదుర్గమ్మ ప్రభ ఊరేగింపు

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రొయ్యూరు శివారు కనకదుర్గాపురంలో ఆదివారం కనకదుర్గమ్మతల్లి జాతర వైభవంగా జరిగింది. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆదివారం కనకదుర్గమ్మతల్లి భారీ ప్రభలను వీధుల్లో అట్టహాసంగా ఊరేగించారు. పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

పేకాట శిబిరాలపై దాడి

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పేకాట శిబిరాలపై దాడులు చేసి , పేకాడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసి, వారిపై కేసులు నమోదు చేశామని గుడివాడ తాలూకా ఎస్సై ఎన్.చంటిబాబు తెలిపారు. స్థానికుల నుంచి వచ్చిన సమాచారం మేరకు బొమ్ములూరు శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.1240ల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ మండపం ప్రారంభం



మండపం ప్రారంభిస్తున్న వెల్లంకి శంకరరావు, రాధారాణి దంపతులు

ఉయ్యూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : కలవపాములలో దుర్గామల్లేశ్వర స్వామి ఆలయ మండపాన్ని వెల్లంకి ఫుడ్స్ అధినేత వెల్లంకి శంకరరావు, వెంకట రాధారాణి దంపతులు ఆదివారం ప్రారంభించారు. ఎన్నో సంవత్సరాల క్రితం నిర్మించిన ఆలయ మండపం జీర్ణావస్థకు చేరుకోగా గ్రామస్తుల కోరిక మేరకు వెల్లంకి శంకరరావు రూ.30 లక్షలతో మండపంతో పాటు ఆలయంలో ఇతర పనులు పునఃనిర్మించగా వేదపండితులు మంత్రోచ్చారణ నడుమ ప్రారంభించారు. వెల్లంకి బాబా కోటేశ్వరరావు, రాఘవేంద్రరావు, కలపాల మల్లేశ్వరరావు సేవలందించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, గ్రామస్తులు పెద్ద యెత్తున హాజరయ్యారు. అనంతరం అన్నసమారాధన చేశారు.



కొండాలమ్మ ఆలయంలో పొంగళ్లు తయారు చేస్తున్న భక్తులు

కొండాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. దాదాపు 22 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. భక్తులు ఆలయ పాలపొంగళ్ల శాలలో పాలపొంగళ్లను తయారుచేశారు. అనంతరం వాటిని అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటలవరకూ భక్తులు అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరి ఉన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా గుడ్లవల్లేరు ఎస్సై సత్యనారాయణ నేతృత్వంలో పోలీసులు బందోబస్త్ నిర్వహించారు.



ఎంపికైన క్రీడాకారులతో టీడీపీ, జనసేన నాయకులు

బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపికలు

● అభినందనలు తెలిపిన కూటమి నాయకులు

పెనమలూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మార్చి 2న ఏలూరులో జరిగే జోనల్ బాడీబిల్డింగ్ పోటీలు, ఛత్తీస్‌గఢ్‌లో జరిగే నేషనల్ జూనియర్ పోటీలకు కానూరు అశోక్ జిమ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉమ్మడి కృష్ణా ఎన్టీఆర్ జిల్లాల బాడీ బిల్డింగ్ క్రీడాకారులను ఎంపిక చేశారు. పదమూడు మంది క్రీడాకారులు బాడీ బిల్డింగ్ పోటీలకు, ముగ్గురు స్పోర్ట్స్ ఫిజిక్ పోటీలకు ఎంపిక చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షులు మనోహర్, ప్రధాన కార్యదర్శి అశోక్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, మాజీమంత్రి ఆలపాటి రాజా, టీడీపీ అధికార ప్రతినిధి గొట్టిపాటి రామకృష్ణ, జనసేన నాయకులు అమ్మిశెట్టి వాసు, సీహెచ్ రాజు తదితరులు అభినందించారు.

పారిశుధ్యంపై డీపీవో ఆగ్రహం

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్యాన్ని నిర్లక్ష్యం చేయటం, చెత్త సంపద కేంద్రాల నిర్వహణ లోపాలపై డీపీవో జే అరుణకుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. తోట్లవల్లూరు, వల్లూరుపాలెం, ఐలూరు గ్రామాల్లో ఆదివారం డీపీవో పర్యటించారు. ఆయా పంచాయితీ కార్యాలయాల్లో ఇంటి పన్నుల వసూళ్ళ, పారిశుధ్య చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా తోట్లవల్లూరులో పారిశుధ్యం అధ్వానంగా ఉందన్నారు. ఇకపై రోజూ ఇంటివద్దే తడి, పొడి చెత్త సేకరణ జరగేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరిలోగా గ్రామాల్లో పారిశుధ్యం వంద శాతం మెరుగు పడాలని ఆమె అధికారులకు సూచించారు. అనంతరం ఐలూరులోని కృష్ణానదిపాయలో భక్తుల జల్లు స్నానాలకు కొనసాగుతున్న బోర్ల నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్బారావు జల్లు స్నానాల ఏర్పాట్లను వివరించారు.



కానుమోలు సోమేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రత్యేక పూజలు

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

● ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : కానుమోలులోని గంగాబాలత్రిపుర సుందరీదేవి సమేత సోమేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణం, నూతన నవగ్రహ దేవతా విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. వేదమంత్రాల మధ్య మంగళవాయిద్యాలతో దాతలు నందూరి శ్రీరంగసాయి, లలితమ్మ, తాడిశెట్టి శ్రీహరి, నాగరూప దంపతుల ఆధ్వర్యంలో ఉదయం 11.52 నిలకు నూతన నవగ్రహ దేవత విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అర్చకులు వేదాశీర్వాదంతో స్వామి వారి శేషవస్త్రాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు.

దాసాంజనేయస్వామి ఆలయంలో..

హనుమాన్‌జంక్షన్ : దాసాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం 10వ వార్షికోత్సవం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో 45 అడుగుల విగ్రహం ప్రతిష్ఠించి 10ఏళ్ల పూరైన సందర్భంగా పూజలు, అభిషేకాలు,హనుమాన్‌చాలీసా నిర్వహించారు. కార్యక్రమాలను ధర్మకర్తలు చోడె వెంకయ్య, వల్నాటి సత్యనారాయణ కుటుంబ సభ్యులు పర్యవేక్షించారు.

పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావును గెలిపించాలి

హనుమాన్‌జంక్షన్ : కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కెఎస్.లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆదివారం జంక్షన్‌లో ఇంటింటా విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల బాపులపాడు మండల నాయకులు బేత శ్రీనివాసరావు, నల్లి ఆంజనేయులు, అబ్దుల్‌బారి, శ్యామ్, జుజ్జువరపు ఏసుపాదం, రాఘవయ్య, నల్లి సందీప్ తదితరులు పాల్గొన్నారు.





పునాదిపాడులో టీడీపీ నాయకుల ప్రచారం.. కోడూరుపాడు, ఉమామహేశ్వరపురంలో టీడీపీ అధ్యక్షుడు కొండపల్లి వెంకన్న, ఆర్నేపల్లి సూరిబాబుల ప్రచారం

ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటిని గెలిపించాలి



వీరపనేనిగూడెంలో పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్న టీడీపీ నాయకులు

గన్నవరం (ఉంగుటూరు), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్(రాజా)విజయాన్ని కాంక్షిస్తూ గన్నవరం మండలం తెంపల్లి, వీరపనేనిగూడెం గ్రామాల్లో టీడీపీ గన్నవరం మండల అధ్యక్షులు జాస్తి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పలువురు టీడీపీ నాయకులు ముమ్మర ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి వారిని స్వయంగా కలుసుకుని ఓట్లను అభ్యర్థించారు. కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈనెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజాకి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జూపూడి సురేష్, మండవ లక్ష్మి, చిక్కారపు నాగమణి, చీమలదండు రామకృష్ణ, కంభంపాటి హేమంతకోటేశ్వరరావు, బొర్రా సాయి. జొన్నలగడ్డ సుధాకర్, చిట్టూరి వెంకటేశ్వరరావు, షేక్ మస్తాన్‌వలీ, నడ్డి శివనాగరాజు, కొలుసు అశోక్, వేమూరి నవీన్, వల్లూరి విజయమాధవ్, మెట్లపల్లి రారాజు, బండి శ్రీనివాస్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, నిమ్మకూరి ప్రతాప్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కంకిపాడు : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని టీడీపీ నాయకులు కాసరనేని కరుణ అన్నారు. మండలంలోని పునాదిపాడు గ్రామంలో ఆదివారం కూటమి అభ్యర్థికి మద్దతుగా విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు కర్రా కిషోర్, ముసుబోయిన నాగరాజు, సీహెచ్ రాజేష్, కె. నరేష్, సాదం రాఘవ, ఎం. రవి, ఎం. శివయ్య, భాస్కరరావు, భార్గవ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములయ్యేలా పట్టభద్రుల ప్రగతి కోసం అమూల్యమైన ఓటును సద్వినియోగం చేసుకుంటూ కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్ర సాద్‌కు మద్దతు పలకాలని టీడీపీ అధ్యక్షుడు కొండపల్లి వెంకన్న కోరారు. కోడూరుపాడు, ఉమామహేశ్వరపురం గ్రామాల్లో కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటికి మద్దతుగా ఆదివారం ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి ఆలపాటికి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆర్నేపల్లి సూరిబాబు, వెంకటేశ్వరరావు, పాండురంగారావు పాల్గొన్నారు.



నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గుడివాడ పట్టణలో రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల నిమిత్తం 24వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీబీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. పెద్దకాలువ సెంటర్ నుంచి ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు వరకు గల మూడు ట్రాన్స్ ఫార్మర్లకు సంబంధించిన విద్యుత్‌ను నిలిపివేయనున్నామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఆపే క్రమంలో ఆటోనగర్ ఆర్టీసీ కాలనీలో 20 నిముషాలు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని వివరించారు.



కనకదుర్గాపురంలో ఊరేగుతున్న కనకదుర్గమ్మ ప్రభ

వైభవంగా కనకదుర్గమ్మ ప్రభ ఊరేగింపు

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రొయ్యూరు శివారు కనకదుర్గాపురంలో ఆదివారం కనకదుర్గమ్మతల్లి జాతర వైభవంగా జరిగింది. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆదివారం కనకదుర్గమ్మతల్లి భారీ ప్రభలను వీధుల్లో అట్టహాసంగా ఊరేగించారు. పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

● పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు గుడివాడ నియోజకవర్గంలో 13 పోలింగ్ కేంద్రాలు

● ఓటు హక్కు వినియోగించుకోనున్న 10,224 ఓటర్లు

ఆంధ్రజ్యోతి - గుడివాడ: ఈ నెల 27వ తేదీన జరుగనున్న కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం 13 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇందులో మొత్తం 10,224 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. గుడివాడ ఎస్‌పీఎస్ మున్సిపల్ పాఠశాలలో పట్టణ పట్టభద్రుల కోసం 7, గుడివాడ రూరల్ మండలం ఓటర్ల కోసం గుడివాడలోని ఏజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 3, గుడ్లవల్లేరులోని చాపరాల సత్యనారాయణ కళాశాలలో 2, మండల కేంద్రమైన నందివాడలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఒక కేంద్రం ఏర్పాటు చేశారు.

రెండు జోన్లు..రెండు రూట్లు

నియోజకవర్గంలో గుడివాడ(152 నుండి 161), గుడ్లవల్లేరు(169,170) పోలింగ్ కేంద్రాలకు జలవనరుల శాఖ ఏఈ అబ్దుల్ మస్తాన్ బేగ్, నందివాడ(151) పోలింగ్ కేంద్రానికి జొన్నపాడు సెక్షన్ జలవనరుల శాఖ ఏఈ ఎస్.ఎస్ పవన్‌కుమార్‌లను జోన్ అధికారులుగా నియమించారు. రూట్ అధికారులుగా గుడివాడ, గుడ్లవల్లేరుకు పి.శివకుమార్(సీనియర్ అసిస్టెంట్), నందివాడకు వీవీపీఎస్ గణేష్(నందివాడ ఎంఆర్‌ఐ)లను నియమించారు. మరో ఇద్దరిని జోన్ అధికారులుగా, రూట్ అధికారులుగా రిజర్వులో ఉంచారు. ఎన్నికల అధికారులకు ఎన్నికల సామగ్రిని ఈ నెల 26వ తేదీన గుడివాడ రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో అందజేయనున్నారు. దీని కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు.



గుడివాడ రూరల్ మండల ఓటర్ల కోసం ఏజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం

ప్రదేశం	పురుషులు	స్త్రీలు	మొత్తం
గుడివాడ పట్టణం	2797	2563	5360
గుడివాడ మండలం	1303	1208	2511
గుడ్లవల్లేరు	794	679	1473
నందివాడ	528	352	880
మొత్తం	5422	4802	1022

ఆలపాటి విజయమే లక్ష్యంగా పనిచేద్దాం

● జనసేన పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్

పామర్రు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం బలపరచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ విజయమే లక్ష్యంగా పనిచేస్తామని పామర్రు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ తెలిపారు. బందరు పార్లమెంట్ పరిధిలోని జనసేన నేతల సమన్వయ సమావేశాన్ని జిల్లా ఆపార్టీ అధ్యక్షుడు బండి రామకృష్ణ అధ్యక్షతన ఆదివారం బందరులో నిర్వహించారు. ఈ సభను ఎంపీ వల్లభనేని బాలశౌరి సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పామర్రు ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ మాట్లాడుతూ పామర్రు నియోజకవర్గంలోగల పట్టభద్రులు 6447మంది ఓటర్లు ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటికి విజయం చేకూర్చే విధంగా కూటమినేతలతో ప్రచారం చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో జనసేన ఎంపీటీసీ కూనపరెడ్డిసుబ్బారావు పాల్గొన్నారు.



జనసేన నేతల సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న నరేష్

నాగేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠ

మచిలీపట్నం టౌన్ : చిలకలపూడి నాగేంద్ర స్వామి ఆలయంలో ఆదివారం వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. వేమూరి శ్రీనివాస శర్మ బ్రహ్మత్వం వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు బెల్లంకొండ శివకేశవులు, శిరీష, బొమ్మిడి పాండురంగారావు, సుజాత, నవకాంత్ పాల్గొన్నారు.

కొండాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. దాదాపు 22 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. భక్తులు ఆలయ పాల పొంగళ్ల శాలలో పాలపొంగళ్లను తయారుచేశారు. అనంతరం వాటిని అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటలవరకూ భక్తులు అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరి ఉన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా గుడ్లవల్లేరు ఎస్సై సత్యనారాయణ నేతృత్వంలో పోలీసులు బందోబస్త్ నిర్వహించారు.



కొండాలమ్మ ఆలయంలో పొంగళ్లు తయారు చేస్తున్న భక్తులు



క్యూ లైన్లలో బారులు తీరిన భక్తులు

ఆలయ జీర్ణోద్ధరణ, భూమిపూజ

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గుడ్లవల్లేరులో ఆదివారం ఉదయం గంగానమ్మ అమ్మవారి ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమాలు భూమిపూజ నిర్వహించారు. తొలుత గణపతి పూజ, హోమాన్ని వేదపండితులు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయంలో ప్రతిష్ఠించిన గంగానమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని శాస్త్రోక్తంగా కాడెడ్ల సహాయంతో బాలాలయానికి తరలించారు. బాలాలయంలో తాత్కాలిక ప్రతిష్ఠా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పునఃనిర్మాణం, అమ్మవారి ప్రతిష్ఠ జరిగే వరకూ గంగానమ్మ అమ్మవారు బాలాలయంలోనే కొలువుతీరుతారని వేదపండితులు తెలిపారు. వల్లభనేని వెంకట్రావు, కొసరాజు బాపయ్య చౌదరి, వల్లభనేని వెంకట సుబ్బారావు చౌదరి, యెనిగళ్ల నాగేశ్వరరావు, వైపీసీ ప్రసాద్, నాగేశ్వరరావు, రామ్మోహనరావు, యలమంచిలి రామకోటేశ్వరరావు, పళ్లెం నరసింహారావు, యెర్నేని మధు, కాకాని రామారావు, బాబి, ఈశ్వరరావు, దుర్గారావు, కొండలరావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



బాలాలయంలో ప్రతిష్ఠించిన గంగానమ్మ

పారిశుధ్యంపై డీపీవో ఆగ్రహం

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్యాన్ని నిర్లక్ష్యం చేయటం, చెత్త సంపద కేంద్రాల నిర్వహణ లోపాలపై డీపీవో జే అరుణకుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. తోట్లవల్లూరు, వల్లూరుపాలెం, ఐలూరు గ్రామాల్లో ఆదివారం డీపీవో పర్యటించారు. ఆయా పంచాయితీ కార్యాలయాల్లో ఇంటి పన్నుల వసూళ్లు, పారిశుధ్య చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా తోట్లవల్లూరులో పారిశుధ్యం అధ్వనంగా ఉందన్నారు. ఇకపై రోజూ ఇంటివద్దే తడి, పొడి చెత్త సేకరణ జరగేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరిలోగా గ్రామాల్లో పారిశుధ్యం వంద శాతం మెరుగు పడాలని ఆమె అధికారులకు సూచించారు. ఈ నెలాఖరులోపు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది అలసత్వం వీడి ఇంటి పన్నులు 75 శాతం వసూలు చేయాలని హెచ్చరించారు. అనంతరం ఐలూరులోని కృష్ణానదిపాయలో భక్తుల జల్లు స్నానాలకు కొనసాగుతున్న బోర్ల నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సుబ్బారావు జల్లు స్నానాల ఏర్పాట్లను వివరించారు. ఈవోపీఆర్‌డి వెంకటేశ్వరమ్మ , ఆయా పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఐలూరులో మహాశివరాత్రికి జల్లు స్నానాల ఏర్పాట్లపై ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈతో మాట్లాడుతున్న డీపీవో అరుణకుమారి

3 నుంచి గంగానమ్మ జాతర

పామర్రు,ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): గంగానమ్మ తల్లి అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాన్ని మార్చి3వతేదీ నుంచి తొమ్మిదవతేదీ వరకు నిర్వహిస్తున్నట్టు ఆలయ జాతర కమిటీ నిర్వాహకులు బొమ్మారెడ్డి రామిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివాహాలు, గృహప్రవేశాలు ఇతర శుభకార్యాలు నిర్వహించేందుకు ముహూర్తాలను జాతరకు అనుగుణంగా నిర్ణయించుకోవాలని సూచించారు.

వంతెనకు మరమ్మతులేవీ..!

పెదపారుపూడి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పెదపారుపూడి మండల పరిధిలోని మహేశ్వరపురం వద్ద ఓల్డ్ లింగవరం ఛానల్ వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఈ వంతెనపై దూళ్లవానిగూడెం, దోసపాడు, తమ్మలంపాడు, జనార్ధనపురం, జంక్షన్ టు గుడివాడ రోడ్డుకి కలుస్తుంది. సంబంధిత అధికారులు స్పందించి ఈ వంతెనను బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన వంతెన

వైభవంగా సంతాన నాగేంద్రస్వామి కల్యాణ మహోత్సవాలు

నందివాడ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తమిరిశ శివారు కుముదలవాడలోని సంతాన నాగేంద్ర స్వామి 28వ వార్షిక కల్యాణ మహోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గుత్తా పట్టాభి రామయ్య - వెంకటరత్నాంబ దంపతుల కుమారుడు గుత్తా త్రివిక్రమరావు భార్య వెంకట రజనికుమారి ఆధ్వర్యంలో స్వామి భక్తురాలు శాంతమ్మ అధ్యక్షతన పూజారి లోకేశ్వరరావు కల్యాణ మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 1997లో శాంతమ్మ అనే మహిళకు స్వామి స్వయంగా కనిపించి పుట్టలో ఉన్నాను .. పూజలు చేయమని తెలిపారని, అప్పటి నుంచి నాగేంద్ర స్వామికి పూజలు నిర్వహిస్తున్నట్టు శాంతమ్మ తెలిపారు. నాగేంద్ర స్వామి మహిమతో గుత్తా త్రివిక్రమరావు దంపతులు అక్కడ స్వామి మహిమలను గుర్తించి 2001లో ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ప్రతీ సంవత్సరం కళ్యాణ వేడుకలు నిర్వహిస్తున్నట్టు ఆలయ పూజారి లోకేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు ఆదివారం తెల్లవారుజాము నుంచే నాగేంద్ర స్వామికి నవరసాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పూజారి సుమారు 50 మంది దంపతులచే సంతాన నాగేంద్ర స్వామికి కల్యాణం చేయించారు. ఇక్కడ పూజలు చేస్తే సంతానం లేని వారికి సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. అనంతరం సుమారు 2 వేల మందికి అన్నదానం చేశామని గుత్తా త్రివిక్రమరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణ, సజ్జా శ్రీరాములు, వి.తిరుపతి, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

వరుస దొంగతనాలతో పల్లెల్లో ఉలికిపాటు

పామర్రు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పామర్రు మండలంలో ఇటీవల చోటుచేసుకున్న చైన్ స్నాచింగ్ విషయం మరువక ముందే జాతీయ రహదారి పక్కనే గల పల్లెల్లో శనివారం అర్ధరాత్రి జరిగిన దొంగతనాలతో పల్లె ప్రాంతాల్లోని ప్రజానీకం ఒక్కసారిగా ఉలికిపాటుకు గురైంది. రాబోయే వేసవిలో గ్రామాల్లోని ప్రజలు రాత్రి వేళల్లో ఆరుబయట, డాబాలపైనా నిద్రించడం ఇబ్బందికరంగానే ఉంటోందని వారు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. గ్రామాల్లో దశాబ్ద కాలం క్రితం పోలీసులు అర్ధరాత్రి సమయాల్లో గస్తీ నిర్వహించేవారు. ప్రస్తుతం పోలీసుశాఖ అలాంటి వాటికి స్వస్తి పలకడంతోనే ఇలాంటి సంఘటనలు పునరావృతమవుతున్నాయని ప్రజల నుంచి సర్వత్రా ఆరోపణలు వినవస్తున్నాయి. ఇప్పటికైనా గ్రామాల్లో దొంగతనాలు, ఇతర గంజాయి బ్యాచ్‌లు చేసే ఆగడాలను అరికట్టేవిధంగా పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. ఒక్కో పోలీస్ కానిస్టేబుల్‌కు ఒక్కో గ్రామాన్ని దత్తతుగా ప్రకటించాలని వారు కోరుతున్నారు.



ఎర్రన్నాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

ఘనంగా ఎర్రన్నాయుడు జయంతి

గుడివాడ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పేదల పక్షాన నిలబడి, వారికి ఎనలేని సేవలందించిన ఎర్రన్నాయుడు చిరస్మరణీయులని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఆదివారం స్థానిక ఏలూరురోడ్డులోని ప్రజావేదికలో కేంద్ర మాజీ మంత్రి ఎర్రంనాయుడు 68వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే వెనిగండ్ల పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎర్రన్నాయుడు పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షులు దింట్యాల రాంబాబు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు, నాయకులు రెడ్డి షణ్ముఖ్, వంగపండు ఆదినారాయణ, అడుసుమిల్లి శ్రీనివాసరావు, సింగవరపు ప్రభాకరరావు, గొర్రెల నరేంద్ర, అమర్‌బాబు పాల్గొన్నారు.

ప్రముఖుల జీవిత చరిత్రలు చదవాలి

● ప్రముఖ సాహితీవేత్త సత్యవాణి

ఉయ్యూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మహానుభావుల జీవిత చరిత్రలు చదవడం అలవాటు చేసుకుని ఉత్తమ పౌరులుగా ఎదిగి పేరు ప్రఖ్యాతులు గడిచాలని సాహితీవేత్త సత్యవాణి విద్యార్థులకు సూచించారు. ముదునూరులో ఆదివారం జీవిత చరిత్రల గ్రంథాల యం తృతీయ వార్షికోత్సవ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. పిల్లలకోసం జీవిత చరిత్రలు తెలిసే విధంగా గ్రంథాలయం ఏర్పాటు చేసిన నాగులపల్లి భాస్కరరావును అభినందించారు. డీవైఈవో పద్మారాణి, సర్పంచ్ వెంకటనాగలక్ష్మి, సరసభారతి గబ్బిట దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాహితీవేత్త సత్యవాణి

92 ఏళ్ల మధుర స్మృతులు

● చల్లపల్లి రాజా హైస్కూల్, కళాశాల పూర్వవిద్యార్థుల ఆత్మీయ, అపూర్వ కలయిక

చల్లపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): 1932 నుంచీ 2024 వరకు 92 సంవత్సరాల చల్లపల్లి రాజా హైస్కూల్, కళాశాల పూర్వవిద్యార్థుల ఆత్మీయ, అపూర్వ కలయిక ఆదివారం ప్రవాస భారతీయులు మండవ శేషగిరిరావు, విశ్రాంత ఆర్డీవో నాదెళ్ల శివరామకృష్ణ ఆధ్వర్యం లో సందడిగా జరిగింది. ముందుగా చల్లపల్లి రాజా, సర్వేపల్లి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దాలిసర్రు నుంచి వచ్చి చదువుకున్న 1948 బ్యాచ్‌కు చెందిన బొందలపాటి వెంకటేశ్వరరావు (90)తోపాటు గత బ్యాచ్ వరకు పలు బ్యాచ్‌ల పూర్వవిద్యార్థులు తరలిరావటంతో కళాశాల సందడిగా మారింది. సుమారు 1500 మంది పూర్వవిద్యార్థులు కళాశాలకు వచ్చి చదువుకున్ననాటి తీపి జ్ఞాపకాలను, మధుర స్మృతులను గుర్తుచేసుకున్నారు. గురువులను సన్మానించి, ఆశీర్వాదం తీసుకున్నారు. కలిసి భోజనాలు చేసి కబుర్లు చెప్పుకున్నారు.

పేకాట శిబిరాలపై దాడి .. ఎనిమిది మంది అరెస్టు

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పేకాట శిబిరాలపై దాడులు చేసి , పేకాడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసి, వారిపై కేసులు నమోదు చేశామని గుడివాడ తాలూకా ఎస్సై ఎన్.చంటిబాబు తెలిపారు. స్థానికుల నుంచి వచ్చిన సమాచారం మేరకు బొమ్ములూరు శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.1240ల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. బిళ్లపాడు శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న మరో ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1020లు నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలి

నాగాయలంక, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తడి, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించేలా సిబ్బందిని సమాయత్తం చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి సీతారామయ్య ఆదేశించారు. పంచాయతీ కార్యాలయంలో చెత్త సేకరణపై సమీక్ష నిర్వహించారు. చెత్తను సంపద కేంద్రాలకు తరలించి వర్మీకంపోస్టు తయారు చేసి తక్కువ ధరకు విక్రయించాలని ఆదేశించారు. భావదేవరపల్లి, నంగేగడ్డ, సంగమేశ్వరం, నాగాయలంక గ్రామాల్లో పర్యటించి పారిశుధ్యంపై ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీ కె.అప్పల నరసమ్మ కార్యదర్శులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 99, 110
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.465



శివరాత్రికి వచ్చే భక్తులకు పాత ఎడ్లంకలో నరకమే



అవనిగడ్డ రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పాత ఎడ్లంక బాలకోటేశ్వరస్వామి దేవాలయానికి మహాశివరాత్రికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పేలా లేవు. కాజ్వే సమీపాన బుసక రోడ్డు భక్తులకు, వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకంగా కలిగించడం ఖాయం. మహాశివరాత్రికి వచ్చే భక్తులకు నరకం చూపిస్తుందనడంలో ఎలాంటి అనుమానం లేదు. ప్రభుత్వ అధికారులు, దేవదాయశాఖ అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి కనీసం గ్రావెల్‌తో లెవలింగ్ చేస్తే భక్తుల రాకపోకలు సజావుగా సాగుతాయని దేవా గోవర్ధన్ కోరారు.

ఆదాం స్వచ్ఛ సేవలు నిరుపమానం



ఆదాం భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న పట్టాభి, పక్కన ఆదాం(ఫైల్)

నాగాయలంక, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ నాగాయలంక సీనియర్ కార్యకర్త నలుకుర్తి ఆదాం (73) సేవలు నిరుపమానమని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి పేర్కొన్నారు. గుండెపోటుతో మృతి చెందిన ఆదాం పార్థివదేహాన్ని ఆదివారం ఆయన సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. కొవిడ్ తర్వాత స్వచ్ఛ నాగాయలంక కార్యక్రమాలు నిలిచిపోయినప్పటికీ ఆదాం ఒక్కడే బెల్ కంపెనీలో ఉద్యోగ విరమణ అనంతరం స్వచ్ఛ కార్యక్రమాలు కొనసాగిస్తూ ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త బొబ్బా గోవర్ధన్, ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, చిట్టా అన్నపూర్ణయ్య, ఎంపీటీసీ సభ్యుడు లంకే శ్రీనివాస ప్రసాద్, సర్పంచ్ కైతేపల్లి అంకాలు, మేడికొండ విజయ్, తలశిల రామకృష్ణ, ఉపసర్పంచ్ తలశిల నాని, స్వచ్ఛ నాగాయలంక సొసైటీ ప్రతినిధులు సింహాద్రి కృష్ణ ప్రసాద్, మండవ బాబూరావు, మాదివాడ నిరంజనరావు, గడ్డిపాటి సుధీర్ బాబు, డాక్టర్ ఏ.వి.ఎల్.నారాయణ, వాడపల్లి నాగేశ్వరరావు, తాతయ్య, బోయపాటి రాము, వేకనూరు సుబ్బారావు, షేక్ జానీ, నాగమల్లేశ్వరి తదితరులు ఆదాం భౌతికకయానికి నివాళులర్పించారు.

ఉచిత కంటి వైద్యసేవలు భేష్

నాగాయలంక, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి, సుదర్శి మానవతా సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త బొబ్బా గోవర్ధన్ ఆర్థిక సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ప్రారంభించారు. నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కనిగంటి నారాయణలను అభినందించారు. 80 మందికి కంటి పరీక్షలు చేశారు. అందులో 52 మందిని ఆపరేషన్ కోసం ఎంపిక చేశారు. దాత బొబ్బా గోవర్ధన్, ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, వర్రే రాంబాబు, నాగిడి తాతారావు, తలశిల రామకృష్ణ చౌదరి, మేడికొండ విజయ్ తదితర నేతలు పాల్గొన్నారు. తలశిల లీలా మనోహర్, గంగాధర్, మత్తి శివ పర్యవేక్షించారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలి

నాగాయలంక, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తడి, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించేలా సిబ్బందిని సమాయత్తం చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి సీతారామయ్య ఆదేశించారు. పంచాయతీ కార్యాలయంలో చెత్త సేకరణపై సమీక్ష నిర్వహించారు. చెత్తను సంపద కేంద్రాలకు తరలించి వర్మీకంపోస్టు తయారు చేసి తక్కువ ధరకు విక్రయించాలని ఆదేశించారు. భావదేవరపల్లి, నంగేగడ్డ, సంగమేశ్వరం, నాగాయలంక గ్రామాల్లో పర్యటించి పారిశుధ్యంపై ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీ కె.అప్పల నరసమ్మ, కార్యదర్శులు పవన్‌కుమార్, పి.మల్లిఖార్జునరావు, కొండేటి ఆదిశేషు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

అవనిగడ్డ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : బాలికల సంక్షేమ వసతిగృహంలో బాలికలకు ప్రభుత్వం సమకూర్చిన స్టేషనరీని ఆదివారం అందజేశారు. సంక్షేమాధికారిణి అనురాధ పుస్తకాలు, ప్యాడ్లు, ఇతర స్టేషనరీ అందజేశారు. వసతిగృహ విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆలపాటి గెలుపును ఎవరూ ఆపలేరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బాలశౌరి



బల్లిపర్రులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కాగిత



లంకపల్లిలో ఓట్లు అభ్యర్థిసున్న కొమ్మారెడ్డి పట్టాభి

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపును ఎవరూ ఆపలేరని, భారీ మెజారిటీతో గెలుస్తారని ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో బాలశౌరి మాట్లాడారు. కూటమి పార్టీల నాయకులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు కార్యకర్తలు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఒకటో డివిజన్‌లో బత్తిన దాసు, శ్రీను ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ నాయకుడు వి. సుందరరాం ఆధ్వర్యంలో 45వ డివిజన్‌లో పర్యటించారు. పి.వి. ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల : గత ఆరు నెలల్లో కూటమి ప్రభుత్వం రూ.6 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చి 2.50 లక్షల ఉద్యోగాల సృష్టికి నాంది పలికిందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను విజయాన్ని కాంక్షిస్తూ లంకపల్లిలో ఆదివారం ఆయన ఓటర్లను కలసి ఓట్లు అభ్యర్థించారు. గ్రామానికి విచ్చేసిన కొమ్మారెడ్డి పట్టాభికి వారి వంశస్థులు, టీడీపీ నేత కొమ్మారెడ్డి లీలబాబు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త బొబ్బా గోవర్ధన్, మండల టీడీపీ అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, పరుచూరి సుభాష్ చంద్రబోస్, పరిశె చలపతి, గుత్తికొండ వరప్రసాద్, తుమ్మల నందేశ్వరరావు, మేడికొండ విజయ్, కొమ్మారెడ్డి లీలాకృష్ణయ్య, వీరమాచినేని భవానీప్రసాద్, మోత్కూరి కోటి నాగులు, కొల్లూరి జేమ్స్, పెనుమాక సుదర్శన్, కనుమూరి సుబ్రహ్మణ్యం, కనుమూరి రామకృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగాయలంక : స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ ఆదివారం నాగాయలంకలో పర్యటించి పట్టభద్రులను ఓట్లు అభ్యర్థించారు. మాజీ సర్పంచ్ మండవ బాలవర్ధిరావు, టీడీపీ నాయకులు బొబ్బా గోవర్ధన్, తెలుగు యువత అధ్యక్షులు మేడికొండ విజయ్ పాల్గొన్నారు

పెడన రూరల్ : ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ కోరారు. బల్లిపర్రులో ఇంటింటికి తిరిగి ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. శలపాటి ప్రసాద్, శీరం పరసాద్, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మోపిదేవి : ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు మద్దతుగా బీజేపీ నాయకులు మోపిదేవిలో విస్తృత ప్రచారం నిర్వహించారు. భోగాది చంద్రశేఖర్, కామిశెట్టి రమేష్, భోగాది రమాదేవి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ రూరల్ : పులిగడ్డ, రామకోటిపురం గ్రామాల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని కూటమి నేతలు ప్రచారం నిర్వహించారు. జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి గుంటూరు వినయ్ బాబు, బూత్ కన్వీనర్ నాగిడి రాంబాబు, మండలి శివప్రసాద్, మండలి రామ్మోహనరావు, చెన్నూ బాబురావు, నాగిడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. రామకోటిపురంలో ఎంపీటీసీ సభ్యుడు బొప్పన భాను, గరికిపాటి శ్రీను, భూపతి శ్రీను, దివి శ్రీను, కిరణ్, సాయిభార్గవ పాల్గొన్నారు.

కోడూరు : మండలంలో ఉన్న 1450 ఎమ్మెల్సీ ఓట్లన్నీ పోల్ అయ్యేలా నాయకులు కృషి చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు కోరారు. ఎమ్మె ల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ విజయాన్ని ఆకాంక్షిస్తూ కోడూరులో ప్రచారం నిర్వహించారు. కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, మేడా శివాజీ, ఇమ్రాన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

92 ఏళ్ల మధుర స్మృతులు

● చల్లపల్లి రాజా హైస్కూల్, కళాశాల పూర్వవిద్యార్థుల ఆత్మీయ, అపూర్వ కలయిక
● తరలివచ్చిన ఎన్నారైలు, ప్రముఖులు ● ప్రత్యేక ఆకర్షణగా 90 ఏళ్ల పూర్వ విద్యార్థి



ఆత్మీయ కలయికలో గురువులతో పాల్గొన్న చల్లపల్లి రాజా హైస్కూల్, కళాశాల పూర్వవిద్యార్థులు

చల్లపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఒక బ్యాచ్ కాదు..రెండు బ్యాచ్‌లు కాదు 1932 నుంచీ 2024 వరకు 92 సంవత్సరాల చల్లపల్లి రాజా హైస్కూల్, కళాశాల పూర్వవిద్యార్థుల ఆత్మీయ, అపూర్వ కలయిక ఆదివారం ప్రవాస భారతీయులు మండవ శేషగిరిరావు, విశ్రాంత ఆర్టీవో నాదెళ్ల శివరామకృష్ణ ఆధ్వర్యం లో సందడిగా జరిగింది. ముందుగా చల్లపల్లి రాజా, సర్వేపల్లి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దాలిప్రు నుంచి వచ్చి చదువుకున్న 1948 బ్యాచ్‌కు చెందిన బొందలపాటి వెంకటేశ్వరరావు (90)తోపాటు గత బ్యాచ్ వరకు పలు బ్యాచ్‌ల పూర్వవిద్యార్థులు తరలిరావటంతో కళాశాల సందడిగా మారింది. సుమారు 1500 మంది పూర్వవిద్యార్థులు కళాశాలకు వచ్చి చదువుకున్ననాటి తీపి జ్ఞాపకాలను, మధుర స్మృతులను గుర్తుచేసుకున్నారు. గురువులను సన్మానించి, ఆశీర్వాదం తీసుకున్నారు. తరగతి గదులకు వెళ్లి కూర్చుని నాటి విశేషాలను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. కలిసి భోజనాలు చేసి కబుర్లు చెప్పుకున్నారు. బ్యాచ్‌లు బ్యాచ్‌లుగా గ్రూపు ఫొటోలు దిగారు. మాతుజే సలామ్, శివతాండవం, కోలాటం, డప్పు ప్రదర్శన ఆకట్టుకున్నాయి. ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహణకు చొరవ చూపిన ఎన్నారై మండవ శేషగిరిరావు, విశ్రాంత ఆర్టీవో నాదెళ్ల శివరామకృష్ణలను పూర్వవిద్యార్థులు ఘనంగా సత్కరించారు.




గురువులతో పూర్వ విద్యార్థులు, మాట్లాడుతున్న ఎన్నారై మండవ శేషగిరిరావు, బొందలపాటి వెంకటేశ్వరరావు(90)

గురువులకు సన్మానం

గురువులు నల్లూరి రామారావు, టి.సాంబశివరావు, పి.ప్రభాకరరావు, రాయపాటి ప్రసాదరావు, సీతారామస్వామి, సిబ్బంది బండి లీలావతి, రాఘవయ్యలను ఘనంగా సన్మానించారు. వివిధ రంగాల ప్రముఖులు మత్తి వెంకటేశ్వరరావు, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, కొర్రపాటి కృష్ణప్రసాద్, గొరిపర్తి నిఖిలేష్, వడ్లమూడి రంగారావు, గరిమెళ్ల విజయలక్ష్మి, నెరుసు కృష్ణాంజనేయులు, నాదెళ్ల రాధాకృష్ణ తదితరులు ప్రసంగించారు. గుత్తికొండ కోటేశ్వరరావు, విజయలక్ష్మి, మల్లుపెద్ది రాణీకుమారి, మేకా శివనాగేశ్వరరావు, సజ్జా చలపతిరావు, కోనేరు కరుణాకర్, దోనేపూడి శంకర్, బొందలపాటి మురళి తదితరులు పర్యవేక్షించారు.



అచలేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ, పాల్గొన్న స్వామీజీలు, భక్తులు, ఎంపీ బాలశౌరిని సత్కరిస్తున్న బంగారుబాబు, శ్రీరాముని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మండలి



శ్రీరామపాద క్షేత్రంలో భారీ ప్రభ

గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ

● చల్లపల్లి, పాగోలులో విగ్రహ ప్రతిష్ఠ ● వేకనూరులో సూర్యనారాయణస్వామి శాంతి కల్యాణం ● మోపిదేవిలో సకలేశ్వరస్వామి గ్రామోత్సవం

చల్లపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పాగోలులోని కైవల్యాశ్రమ చలాచల బోధోపదేశ మందిర ప్రాంగణంలో కమలాత్మికా సహిత అచలేశ్వర పంచాయతన ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా జరిగింది. యంత్ర ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, ప్రాణం సూక్తం, దృష్టి కుంభం, దర్పణ దర్శనం, దర్శనం, మహాబలిహరణ, ప్రతిష్ఠాంగ హోమం, మహాపూర్ణాహుతి తదితర కార్యక్రమాలు డాక్టర్ వడ్లమాని సుబ్రహ్మణ్య అవధాని, కేదార శర్మ బ్రహ్మత్వంలో విద్యాసాగర్ గురూజీ పర్యవేక్షణలో జరిగాయి. సాయి సుధాకర పూర్ణానందస్వామి, గురుదత్త శివరుద్రస్వామి, కమలాత్మికా సహిత అచలేశ్వర పంచాయతన ప్రతిష్ఠామహోత్సవంలో ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పాల్గొన్నారు. మేనేజింగ్ ట్రస్టీ చాపరాల గాంధీప్రసాద్, ట్రస్టీ మేకా బంగారుబాబు, వక్కలగడ్డ దుర్గాప్రసాద్ దంపతులు పూజలు జరిపారు. ఆలయ ట్రస్టీ మేకా బంగారుబాబు ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌లను సన్మానించారు. సర్పంచ్‌లు పైడిపాముల కృష్ణకుమారి, డొక్కు నాగేశ్వరరావు, నేతలు పరుచూరి సుభాష్ చంద్రబోస్, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, వేమూరి రమేష్‌బాబు, వేమూరి గోవర్ధన్, కోసూరు శివాజీ, తుటారం ప్రసాద్ పాల్గొన్నారు.

రామాలయ ప్రతిష్ఠా మహోత్సవం

చల్లపల్లి : పడమరవీధి జెండా చెట్టు బజారులో పునఃనిర్మించిన రాఘవరపు వెంకట కృష్ణమ్మ జానకి రామాలయంలో ఆదివారం సీతాలక్ష్మణ హనుమత్ సమేత శ్రీరామచంద్ర స్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం వంగల నాగవర్ధన్ ఆధ్వర్యంలో కన్నుల పండువగా జరిగింది. డాక్టర్ వంగల శ్రీగిరిబాబు, కాకుమాను శ్రీనివాస హరీష్ దంపతులచే డాక్టర్ కనుమళ్ల రామకృష్ణశాస్త్రి, రూపరాజు విజయ్ కుమార్ శర్మ ప్రతిష్ఠా పూజలు చేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. వేలాది మంది భక్తులకు అన్నసమారాధన జరిగింది.

ప్రసన్నాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

అవనిగడ్డ రూరల్ : మోదుమూడిలో ప్రసన్నాంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించి 60 సంవత్సరాల పూర్తయిన సందర్భంగా ఆదివారం అంగరంగ వైభవంగా పూజలు నిర్వహించారు. లక్ష సింధురార్చన హారతి, మంత్రపుష్పం, ఆశీర్వచనం, తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు సిర్విశెట్టి వెంకట రాజేశ్వరరావు, రామకృష్ణ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

సూర్యనారాయణస్వామి శాంతి కల్యాణం

వేకనూరులో సూర్యనారాయణ స్వామి శాంతి కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. పాకలపాటి రాము బ్రహ్మత్వంలో తుంగల శ్రీనివాసరావు దంపతులు పీటల మీద ఆశీనులై స్వామి కల్యాణం నిర్వహించారు. తుంగల రామకృష్ణ ఆర్థిక సౌజన్యంతో అన్నదానం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు తుంగల వీరవసంతరావు దంపతులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ముగిసిన పోతురాజు స్వామి జాతర

నాగాయలంక : నాగాయలంకలో పోతురాజు స్వామి 20వ వార్షిక జాతర ఆదివారం రాత్రితో వైభవంగా ముగిసింది. భక్తులు చద్ది నైవేద్యాలను సమర్పించారు. దాతల సహకారాలతో ఆలయ భక్త బృందం ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిగింది.

సకలేశ్వరస్వామి గ్రామోత్సవం

మోపిదేవి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మోపిదేవిలో గంగాపార్వతీ సమేత సకలేశ్వరరస్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. పసుపు, కుంకుమలు, కొబ్బరికాయలు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ పర్యవేక్షకులు సత్యనారాయణ, సహాయక ఉద్యోగులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శ్రీరామపాదక్షేత్రంలో భారీ ప్రభ

అవనిగడ్డ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : దివి ప్రాంతంలోని శైవాలయాల్లో ఎక్కడా లేని రీతిలో నాగాయలంక శ్రీరామపాదక్షేత్రంలో ప్రభలను ఏర్పాటు చేశారు. శ్రీరామపాదక్షేత్రంలోని రామలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలో శ్రీరామపాదక్షేత్ర కమిటీ ప్రభను ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. పలువురు పర్యాటకులు మహాదేవుని ప్రభ వద్ద ఫొటోలు దిగుతూ సందడి చేశారు.

నాగేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠ

మచిలీపట్నం టౌన్ : చిలకలపూడి నాగేంద్ర స్వామి ఆలయంలో ఆదివారం వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. వేమూరి శ్రీనివాస శర్మ బ్రహ్మత్వం వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు బెల్లంకొండ శివకేశవులు, శిరీష, బొమ్మిడి పాండురంగారావు, సుజాత, నవకాంత్ పాల్గొన్నారు.

శక్తిగుడిలో హోమాలు

శక్తిగుడి వార్షిక మహోత్సవాల సందర్భంగా ఆదివారం చండీ హోమం, రుద్రహోమం, లక్ష్మీగణపతి హోమం, నవగ్రహ హోమం, నక్షత్ర హోమాలు జరిగాయి. పూర్ణాహుతిలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రామదండు బాలవికాస్ కోలాట బృందం నిర్వహించిన భజన అందరినీ ఆకట్టుకుంది. గోవిందు సాయిరామశర్మ, మండా విశ్వేశ్వర శర్మలు ఈ యాగాలు నిర్వహించారు.

రావి, వేపచెట్టుకు కల్యాణం

పెడన : కొత్తపేట రామాలయం వద్ద గల రావి, వేప చెట్లులకు ఆమనమంచి శ్రీనివాస శర్మ, లక్ష్మీసుధ దంపతులు కల్యాణం జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కల్యాణ ఘట్టాన్ని వీక్షించారు. అన్నసమారాధన నిర్వహించారు.



మోదుమూడిలో ప్రసన్నాంజనేయ స్వామికి పూజలు



పోతురాజుస్వామి జాతరలో భక్తులు



చిలకలపూడిలో నాగప్రతిష్ఠ



పెడనలో రావి, వేపచెట్టుకు కల్యాణం